ఆదివారం 05-5-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 325, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

# రాజకీయం చేయాలంటే డబ్బులే ప్రధానం

- ప్రచారానికి డబ్బుల్లేవని కాంగ్రెస్ టికెట్ వెనక్కి
- నిధులు లేకుండా ఎన్నికల ప్రచారం అసాధ్యం
- పూరి లోక్‌సభ స్థానం అభ్యర్థి సుచిత్ర మొహంతి



**ముందడుగు ఒడిశా:**

లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. నిధుల కొరతతో మరో అభ్యర్థి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిరాకరించారు. ఈ మేరకు తనకు ఇచ్చిన టికెట్‌ను వెనక్కి ఇచ్చేశారు. ఒడిశాలోని పూరి లోక్‌సభ స్థానానికి హస్తం పార్టీ సుచిత్ర మొహంతిని బరిలోకి దింపారు. తాజాగా ఆమె ఎన్నికల్లో పోటీ చేయలేనని తెగేసి చెప్పారు. ఎన్నికల ప్రచారానికి పార్టీ అధిష్టానం ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదని, నిధుల కొరతతో ఇబ్బందిగా ఉందని తెలిపారు. పబ్లిక్ డొనేషన్ డ్రైవ్, ఖర్చును తగ్గించడం వంటి ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు. నిధులు లేకుండా ఎన్నికల ప్రచారం అసాధ్యమన్నారు. అందుకే ఎన్నికల్లో పోటీ చేయడానికి నిరాకరించినట్లు చెప్పారు. ఈ మేరకు టికెట్‌ను తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు రాసిన లేఖలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. 'నాకు నిధులు ఇవ్వడానికి పార్టీ నిరాకరించింది. దీంతో ఎన్నికల ప్రచారం ఇబ్బందిగా మారింది. నిధులు లేకుండా ఎన్నికల ప్రచారం అసాధ్యం. ఈ విషయాన్ని ఒడిశా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ అజోయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లా.. ఆయన కూడా ప్రచార నిధులు మీరే సమకూర్చుకోండి అని స్పష్టంగా చెప్పారు. ఇతర పార్టీలు మాత్రం నిధులు నిండుగా ఉండటంతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు' అని లేఖలో ఆమె పేర్కొన్నారు.




# మరో 4 రోజుల్లో 48 డిగ్రీలకు చేరే అవకాశం

## తెలంగాణలో నిప్పులు కురిపిస్తున్న సూర్యుడు

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రంలో సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. భానుడి భగభగలకు, వడగాలులకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నేటి వరకు రాష్ట్రంలో 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మరో 4 రోజుల్లో 48 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం 7 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతుండటంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండుటెండలకు తోడు ఉక్కపోత కూడా ఎక్కువవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో రెడ్ అలెర్ట్, మిగతా 2లో

# ఈ నెల 9 లోగా ఒక్క రైతుకైనా బకాయి ఉంటే క్షమాపణ చెబుతా

- రైతు రుణమాఫీ చేసి హరీశ్‌రావు నోరు మూయిస్తా
- కొత్తగూడెం ఎన్నికల ప్రచార సభలో రేవంత్‌రెడ్డి




**ముందడుగు ఖమ్మం:**

ఈ నెల 9 లోగా ఒక్క రైతుకైనా బకాయి ఉంటే క్షమాపణ చెబుతా. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ అమలు చేసి హరీశ్‌రావు నోరు మూయిస్తానని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఏ సంకీర్ణంలో చేరతారో కేసీఆర్ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్.. బిజెపిలో చేరతారని మేం మొదటి నుంచి చెబుతున్నాం. కేంద్రంలో బిజెపి చేసిన అన్ని చట్టాలకు బిఆర్ఎస్ మద్దతిచ్చింది. కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు మిగతా 2లో




## స్నానాల గదిలో ప్రసవించిన విద్యార్థిని

వివరాలు 3లో



## వందేళ్ల రికార్డును బ్రేక్ చేస్తున్న ఎండలు

వివరాలు 4లో




## ఐడి వెంట కదులుతున్న జనం

వివరాలు 4లో

ముందడుగు
ఆదివారం, 05-5-2024, హైదరాబాద్

# మరో 4 రోజుల్లో 48 డిగ్రీలకు చేరే అవకాశం

**మొదటిపేజీ తరువాయి**

మరికొన్ని జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్‌లు కొనసాగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరిస్తోంది. శనివారం అత్యధికంగా జగిత్యాల జిల్లా అల్లిపూర్‌లో 46.8 డిగ్రీలు, కరీంనగర్ జిల్లా వీణవంకలో 46.8, నల్లగొండ జిల్లా తెల్దేవరపల్లిలో 46.7, నారాయణపేట జిల్లా ఉట్కూర్‌లో 46.4, నిజామాబాద్ జిల్లా జకోరాలో 46.4, మంచిర్యాల జిల్లా నాస్పూర్‌లో 46.3, పెద్దపల్లి జిల్లా ఈసల తక్కళ్లపల్లిలో 46.1, కామారెడ్డి జిల్లా ఏలుపుగొండలో 45.9, జోగులాంబ గద్వాల జిల్లా వడ్డపల్లిలో 45.9, మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేమాన్‌లో 45.8, సూర్యాపేట జిల్లా మామిళ్లగూడెంలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

# రాహుల్ గాంధీ భారీ తేడాతో ఓడిపోతారు

## రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు

**ముందడుగు గుజరాత్:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వయనాడ్, రాయ్‌బరేలీ స్థానాలలో భారీ తేడాతో ఓడిపోతారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అన్నారు. గుజరాత్‌లోని ఛోటాడేపూర్ జిల్లాలోని బోడెలి పట్టణంలో పార్టీ నిర్వహించిన సభలో పాల్గొన్న ఆయన రాహుల్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలనుద్దేశించి ప్రసంగించిన షా దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతుల కోసం ఉద్దేశించిన కోటాను ప్రతిపక్ష ఇండియా కూటమి దోచుకుంటోందని ఆరోపించారు. ''రాహుల్ గాంధీ అమేథీలో ఓడిపోయినప్పుడు వయనాడ్ వెళ్లారు. ఈసారి వయనాడ్ నుంచి కూడా ఓడిపోతాననే భయంతో ఆయన రాయ్‌బరేలీలోనూ పోటీ చేస్తున్నారు. రాహుల్ మీకు నా సలహా ఏంటంటే సమస్య మీరు పోటీ చేసే స్థానాల్లో లేదు. మీలో ఉంది. కాబట్టి రాయ్‌బరేలీలో కూడా భారీ తేడాతో ఓడిపోతారు.''అని అమిత్ షా వ్యాఖ్యానించారు.



# ఈ నెల 9 లోగా ఒక్క రైతుకైనా బకాయి ఉంటే క్షమాపణ చెబుతా



**మొదటిపేజీ తరువాయి**

ఆ రెండు పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయి. గుజరాత్‌ను ఓడిద్దాం.. తెలంగాణాను గెలిపించుకుందాం రండి. రైతు భరోసా ఆగిపోయిందని కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు. కేసీఆర్ వైఖరిని ఖమ్మం జిల్లా ప్రజలు ముందే పసిగట్టారు. అందుకే 2014, 2019, 2023లో భారాసను దూరం పెట్టారు. ఇక్కడి ప్రజలు చైతన్యవంతులు.. ముందుచూపు ఎక్కువ. పదేళ్ల పాటు తెలంగాణకు ద్రోహం చేసింది భాజపానే. ఈ పదేళ్లలో రాష్ట్రానికి ఒక్క ట్రైనా ఇచ్చారా? రాజ్యాంగాన్ని మార్చాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శే చెప్పారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌ను గెలిపించాలి. తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిన కాషాయ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. రూ.7 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని కేసీఆర్ మాకు అప్పగించారు. భట్టి విక్రమార్క గట్టి వ్యక్తి కాబట్టి నిధులు సర్దుతున్నారు. అన్ని వర్గాల ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# ఆఫ్ స్టార్ క్యాంపెయినర్లుగా కేజ్రీవాల్, సిసోడియా, జైన్

## జైల్లో ఉన్న ముగ్గురి పేర్లు జాబితాలో ప్రకటన



**ముందడుగు ఢిల్లీ:**

దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఢిల్లీ, హరియాణాకు ఆమ్‌ఆద్మీ పార్టీ 40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను శనివారం ప్రకటించింది. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు సునీతా కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఈ జాబితాలో ఉన్నారు. మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ పేర్లూ ఈ జాబితాలో ఉన్నాయి. కేజ్రీవాల్ సహా సిసోదియా, సత్యేందర్ జైన్ ముగ్గురూ ప్రస్తుతం జైల్లో ఉన్న విషయం విధితమే. ఎంపీలైన సంజయ్‌సింగ్, రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్; దిల్లీ మంత్రులు అతిశీ, సౌరభ్ భరద్వాజ్, గోపాల్‌రాయ్, కైలాష్ గహ్లోత్ సహా పార్టీకి చెందిన నేతలు, పంజాబ్ మంత్రులు స్టార్ క్యాంపెయినర్లుగా వ్యవహరించనున్నారు. దిల్లీలో ఏడు లోక్‌సభ స్థానాలకు గానూ నాలుగింట ఆప్ పోటీ చేస్తోంది. మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తోంది. హరియాణాలోని కురుక్షేత్ర, గుజరాత్‌లో రెండు స్థానాలకు పొత్తులపై బరిలోకి దిగింది. పంజాబ్‌లో మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తోంది.



# జంతువులకు ఉన్న విలువ థర్డ్ జెండర్‌లకు లేదు

## ఆకర్షణీయమైన వస్త్రధారణలో ట్రాన్స్ జెండర్ నామినేషన్

**ముందడుగు ఢిల్లీ:**

సార్వత్రిక ఎన్నికల వేళ దేశ రాజధాని ఢిల్లీలో తొలి థర్డ్ జెండర్ అభ్యర్థిగా, దక్షిణ ఢిల్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆకర్షణీయమైన వస్త్రధారణలో ధోతీ, తలపై టోపీ, బంగారు ఆభరణాలు ధరించి సాకేత్‌లోని దక్షిణ ఢిల్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని, తన నామినేషన్ పత్రాలను అందించారు. ఈ ఒక్క నామినేషన్ వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా ట్రాన్స్ జెండర్ సమస్యలపై చర్చ మొదలైందనే చెప్పాలి. బిహార్‌కు చెందిన 26 ఏళ్ల రాజన్ సింగ్ ఢిల్లీలోని సంగమ్ విహార్ ప్రాంతంలో నివసిస్తున్నారు. ట్రాన్స్ జెండర్ల హక్కులతో పాటు సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలు చర్చించుకునేందుకు తాను ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాదు, మన దేశంలో జంతువులకు కూడా సంక్షేమ బోర్డులు ఉన్నాయని, కానీ థర్డ్ జెండర్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవలని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో వివక్షకు గురవుతోన్న థర్డ్ జెండర్లకు సాయమందించేందుకు తన వంతుగా కృషి చేస్తానని వెల్లడించారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళతో యువకుడి ప్రేమాయణం

## 45ఏళ్ల మహిళను చూసి షాక్ గుర్రై మహిళపై దాడి

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

సోషల్ మీడియా ప్రేమలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అలాంటిది ఒక యువకుడికి ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళ పరిచయమైంది. వారిద్దరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారింది. దీంతో వారిద్దరూ స్వయంగా కలుసుకోవాలని నిర్ణయించారు. అయితే ఆ మహిళను చూసి ఆమె వయస్సు 45 ఏళ్లుగా తెలుసుకున్న ఆ యువకుడు షాక్ అయ్యాడు. ఆగ్రహంతో ఆమెను కొట్టాడు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. 20 ఏళ్ల దీపేంద్ర సింగ్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక మహిళ పరిచయమైంది. ప్రొఫైల్ ఫొటో యంగ్‌గా ఉండటంతో ఆమెతో చాట్ చేశాడు. ఆన్‌లైన్ స్నేహం కాస్తా వారిద్దరి మధ్య ప్రేమకు దారి తీసింది. దీంతో ఒకసారి కలుసుకోవాలని భావించారు. దీపేంద్ర సింగ్, ఆ మహిళ స్వయంగా కలుసుకున్నారు. అయితే వయసులో పెద్దగా ఆమె ఉండటం చూసి అతడు షాక్ అయ్యాడు. దీని గురించి ఆ మహిళను ఆరా తీయగా తన వయస్సు 45 ఏళ్లు అని చెప్పింది. దీంతో ఆగ్రహించిన దీపేంద్ర సింగ్ ఆ మహిళను కొట్టాడు. ఆమె తలను నేలకేసి బాదాడు. ఆ మహిళ మొబైల్ ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పారిపోయాడు. మరోవైపు గుర్తు తెలియని వ్యక్తి తనను కొట్టి మొబైల్ ఫోన్ చోరీ చేశాడని ఆ




మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేయగా ఆ మహిళ ఇన్‌స్టాగ్రామ్ స్నేహితుడు దీపేంద్ర సింగ్‌ను నిందితుడిగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేయడంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ముందడుగు
ఆదివారం, 05-5-2024, హైదరాబాద్

# కుమార్తె పెళ్లి కోసం డిపాజిట్ ఇవ్వని బ్యాంక్

## మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య



**ముందడుగు కేరళ:**

కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న డిపాజిట్ డబ్బుల కోసం బ్యాంకు చుట్టూ ఎన్నిసార్లు బ్యాంకు సిబ్బంది డబ్బు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కేరళలో ఈ సంఘటన జరిగింది. మారుత్తూరుకు చెందిన 52 ఏళ్ల సోమసాగరం, పెరుంపఝూత్తూర్ సహకార బ్యాంకులో ఐదు లక్షలు డిపాజిట్ చేశాడు. అయితే కుమార్తె పెళ్లి ఖర్చుల కోసం డిపాజిట్ డబ్బులు తిరిగి ఇవ్వాలని బ్యాంకు సిబ్బందిని కోరాడు. ఆరు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆత్మహత్య చేసుకుంటానని సోమసాగరం బెదిరించినప్పటికీ బ్యాంకు సిబ్బంది స్పందించలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఏప్రిల్ 19న విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఈ నేపథ్యంలో 86 ఏళ్ల సోమసాగరం తండ్రి, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బ్యాంకు సిబ్బందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్నానాల గదిలో ప్రసవించిన విద్యార్థిని

## అమెజాన్ పార్సిల్ కవర్‌లో శిశువును చుట్టి విసిరేసింది




**ముందడుగు కేరళ:**

సమాజం ఏటుపోతుందో, మనుషులు ఆలోచన విధానం ఏలా మారుతుందో తెలియట్లేదు. కేరళలోని కొచ్చిన్‌లో ఓ యువతి తాను జన్మనిచ్చిన శిశువును రోడ్డుపైకి విసిరేసింది. 24 ఏళ్ల ఎంబీఏ విద్యార్థిని అపార్ట్‌మెంట్ బాత్రూమ్‌లో శుక్రవారం ఉదయం శిశువుకు జన్మనిచ్చింది. ఆ విషయం ఆమె తల్లిదండ్రులకు తెలియకూడదని అమెజాన్ పార్సిల్ కవర్‌లో శిశువును చుట్టి అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి బయటకు విసిరేసింది. ఈ క్రమంలో రోడ్డుపై పడిన శిశువు ప్రాణాలు కోల్పోయింది. కొందరు కార్మికులు పార్సిల్ కవర్‌లో ఉన్న శిశువు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పార్శిల్ కవర్‌పై ఉన్న అడ్రస్‌ను బట్టి పోలీసులు నిందితురాలిని గుర్తించారు. ఈ ఘటనపై ఆమెను విచారిస్తున్నారు.

# కుమారుడు చేసిన తప్పుకు తల్లికి శిక్ష

- ప్రేమించిన యువతితో పారిపోయిన కుమారుడు
- 50 ఏళ్ల తల్లిని విద్యుత్ స్తంభానికి కట్టేసిన వైనం



**ముందడుగు కర్ణాటక:**

కుమారుడు చేసిన తప్పుకు ఓ తల్లి శిక్ష అనుభవించింది. కర్ణాటక రాణేబెన్నూర్ తాలూకా అరెమల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు తాను ప్రేమించిన అదే గ్రామానికి చెందిన యువతితో పారిపోయాడు. దీంతో యువతి కుటుంబం ఆగ్రహంతో ఊగిపోయింది. యువకుడి ఇంటికి వెళ్లి అతడి తల్లి 50 ఏళ్ల హనుమవ్వపై దాడి చేసింది. అనంతరం ఆమెను ఇంట్లో నుంచి వీధిలోకి లాక్కొచ్చి విద్యుత్ స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టారు. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం అంటే ఏప్రిల్ 29న జరగగా తాజాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమవ్వ కుమారుడు మంజునాథ్, అదే గ్రామానికి చెందిన పూజ అనే యువతి గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే, వీరి ప్రేమను అంగీకరించక పోవడంతో ఇద్దరూ ఇటీవలే గ్రామం విడిచి పారిపోయారు. ఈ విషయం తెలుసుకున్న పూజ కుటుంబీకులు యువకుడి తల్లిపై దాడి చేసి దారుణంగా కొట్టి అవమానపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని బాధిత మహిళను రక్షించారు. మహిళ ఫిర్యాదు మేరకు ఐపీసీలోని 324, 354 బీ, 504, 506, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేశారు.




# భార్యతో అసహజ శృంగారం రేప్ కాదు

## మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యలు

**ముందడుగు మధ్యప్రదేశ్:**

తన భర్త అసహజ శృంగారం చేస్తున్నట్లు మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసిన కేసులో ఆ రాష్ట్ర హైకోర్టు ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టిపారేసింది. అయితే చట్టం ప్రకారం అది నేరం కాదు అని, ఎందుకంటే ఆమె అతడిని పెళ్లి చేసుకున్నట్లు ఆ ఆదేశాల్లో కోర్టు పేర్కొన్నది. పెళ్లాడిన భార్యతో అసహజ శృంగారం చేయడం ఐపీసీలోని సెక్షన్ 377 ప్రకారం నేరం కాదు అని, దీనిపై మరింత సంప్రదింపులు అవసరం లేదని, భార్య నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తున్నట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ జీఎస్ అహ్లువాలియా నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. బుధవారం వెలుబడిన ఆ ఆదేశాలకు చెందిన వివరాలను గురువారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వైవాహిక బంధంలో రేప్‌కు గుర్తింపు లేదని, జబల్‌పుర్ పోలీసు స్టేషన్‌లో నమోదు అయిన కేసును రద్దు చేస్తున్నామని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది.


# చెల్లెలు ప్రేమ వివాహం సోదరులకు ఇష్టం లేదు

## క్షణికావేశంలో బావను చంపేసిన సోదరులు



**ముందడుగు భద్రాద్రి:**

చెల్లెలు ప్రేమించి పెళ్లి చేసుకోవడం సోదరులు (పెదనాన్న కుమారులు) ఇష్టం లేదు. వారు పగతో రగిలిపోయారు. పెద్ద మనుషులు విధించిన జరిమానా చెల్లించలేదన్న సాకుతో బావను కర్కశంగా కడతేర్చారు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించి పోలీసులకు చిక్కారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగుచూసింది. గ్రామీణం ఎస్ఐ బి.శ్రీనివాస్ వివరాల ప్రకారం.. చిరుతానుపాడుకి చెందిన పద్దం ఉంగయ్య(20) సమీప కొత్తూరు గొత్తికోయ గుంపునకు చెందిన మడవి ఉంగీని నెలరోజుల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఏప్రిల్ 26న యువతి పెదనాన్న కుమారులు ఇడమయ్య, అడమయ్య, ఒక బాలుడు(16) ఉంగయ్య ఇంటికొచ్చారు. తన చెల్లెల్ని ద్విచక్రవాహనంపై తమ ఊరికి తీసుకెళ్లారు. పుట్టింటికి చేరుకున్న రోజు రాత్రే ఉంగీ కనిపించకుండా పోయారు. ఆమెను వెతుక్కుంటూ బయల్దేరిన సోదరులకు చిరుతానుపాడు సమీపంలో ఉంగయ్య తారసడ్డారు. తమ చెల్లెలు ఎక్కడని ఆయనతో వారు గొడవపడ్డారు. క్షణికావేశంలో కండువాను మెడకు బిగించి హత్యచేశారు.




# వందేళ్ల రికార్డును బ్రేక్ చేస్తున్న ఎండలు

- 103 ఏళ్ల తర్వాత ఏప్రిల్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు
- మే తొలి వారం నుంచే సూర్యుడు ఉగ్రరూపం

**ముందడుగు జాతీయం:**

తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఒక ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటినా వడగాలుల ప్రభావం ఉన్నట్లుగా గుర్తిస్తారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో ఎండ వేడి అసాధారణంగా పెరిగిపోతోంది. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాతావరణం వేడిగా ఉంటోంది. అయితే ఈ నెల 6 వరకు తీవ్రమైన వడగాడ్పులు కొనసాగుతాయని భారతీయ వాతావరణశాఖ హెచ్చరించింది.

### మరో నాలుగు రోజుల్లో 49 డిగ్రీలు చేరొచ్చు

హీట్ వేవ్ హెచ్చరిక ఉన్నన్ని రోజులు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా రికార్డవుతాయని తెలిపింది. ఇప్పటికే ఎల్నినో ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలను దాటాయి. మరో నాలుగు రోజుల్లో 49 డిగ్రీలకు చేరువయ్యే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. తెలంగాణలోని దాదాపు 22 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రెడ్ అలర్ట్ జారీ చేసింది. గతేడాది మే నెలతో పోల్చితే ఈ సారి 7.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు వీస్తాయని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని అటు వైద్య నిపుణులు, ఇటు వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వడగాల్పులకు పలువురు మృత్యువాతపడుతున్నారు. కొన్ని రోజులుగా వడదెబ్బతో ప్రతీ రోజూ నలుగురైదుగురు చనిపోతున్నారు. పొద్దంతా ఎండలో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు వడదెబ్బబారిన పడి ప్రాణాలు వదులుతున్నారు.

### సర్వసాధారణంగా 45డిగ్రీలు

మరోవైపు ఈ సారి ఎండలు వందేళ్ల రికార్డును బ్రేక్ చేస్తున్నాయి. అయితే రాష్ట్రాల్లోనే కాదు.. దేశవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. 1921 తర్వాత అంటే 103 ఏళ్ల తర్వాత ఏప్రిల్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. ఈ మధ్యకాలంలో ఎన్నడూ ఏప్రిల్ నెలలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. ఈ ఏడాది మే తొలి వారం నుంచే ఉగ్రరూపం ప్రదర్శిస్తున్న సూరీడు.. రోజురోజుకు మరింతగా మండిపోతున్నాడు. ఫలితంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత సర్వసాధారణంగా మారిపోయింది. అంతేకాదు, వచ్చే ఐదు రోజుల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది.

# జెడి వెంట కదులుతున్న జనం

## ప్రచారంలో ప్రజలు నీరాజనం ● ఆత్మీయంగా పలకరిస్తున్న వైనం






**ముందడుగు విశాఖపట్నం:**

ఉత్తర విశాఖలో జెడీ లక్ష్మినారాయణ వెంట ప్రచారానికి జనం కదులుతున్నారు. అవినీతి రహిత సమాజం కోసం నిరంతరం తపించే మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ శాసనసభలో అడుగుపెట్టాలని ఉత్తర నియోజకవర్గంలో ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. శనివారం సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్లో ప్రచారం నిర్వహించారు. టవర్లోని ఓటర్లతో ముఖాముఖీగా కలుస్తూ జై భారత్ మేనిఫెస్టో గురించి వివరిస్తున్నారు. ఓటర్లు కూడా ఆత్మీయంగా పలకరిస్తూ జై భారత్ అంటూ నినదిస్తున్నారు. లక్ష్మినారాయణ ప్రచారానికి స్థానిక ప్రజలే వెంట నడుస్తున్నారు. నియోజకవర్గ ప్రజలే జెడీని గెలిపించే బాధ్యత తీసుకున్నట్లు తెలుస్తోంది.

### అధికారం కోసమే రెండు పార్టీల పోటీ

రాష్ట్రంలో ఉన్న రెండు రాజకీయాల పార్టీలు అధికారం కోసం పోటీపడుతున్నారు కాని రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టేసి, వారి స్వప్రయోజనాల కోసం పనిచేస్తున్నట్లే ఉందని జై భారత్ అధ్యక్షుడు ఉత్తర విశాఖ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ అన్నారు. మంచి రాజకీయాల కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం మార్పుకు శ్రీకారం చుట్టాల్సిన బాధ్యత నేడు మనందరిపై ఉందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వలేదు, విభజన హామీ లేదు, స్టీల్ ప్లాంట్ ప్రత్యేక హోదాపై ఎవరికి పట్టింపు లేదు అన్నారు.

### మార్పు దిశగా జై భారత్ పార్టీ అడుగులు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఏం చేశాయనేది మాత్రం ఎవరిదగ్గర సమాధానం లేదు. అందుకే ఒక మార్పు దిశగా జై భారత్ పార్టీ అడుగులు వేస్తోంది. మా అడుగులు నిరంతరం కొనసాగుతాయి అన్నారు. మిగతా పార్టీల మేనిఫెస్టోల కంటే మా పార్టీ మేనిఫెస్టో భిన్నంగా ఉంటుంది. ఉపాధి, సంపద సృష్టి, సంక్షేమం అంతేకాని ప్రజలకు ఉచితాలనేవి జై భారత్ పార్టీ ఎక్కడ కూడా మాట్లాడలేదు. ఎందుకంటే రాష్ట్రం ఇప్పటికే 11లక్షల కోట్ల అప్పుల్లో ఉందని తెలుస్తోంది. వైకాపా, టిడిపి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ స్టాంపు పేపర్ మీద ప్రజలకు రాసి ఇవ్వండి. రుణమాఫీ చేయలేదు, మద్యపాన నిషేధం చేయలేదని వారికి ప్రజల అభివృద్ధి కంటే అధికారంలోకి రావడానికే అమలు కాని అమలు ఇస్తున్నారని తెలిపారు.







# డబుల్ ఇస్మార్ట్ ఇంట్రస్టింగ్ అప్‌డేట్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన ఇస్మార్ట్ శంకర్ మూవీ వచ్చి అయిదేళ్లు కావస్తుంది. ఇస్మార్ట్ శంకర్ సూపర్ హిట్ గా నిలవడంతో పాటు రామ్ మరియు పూరికి కెరీర్ లో బూస్ట్ ఇచ్చింది. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ వీరి కాంబో మూవీ రాబోతుంది. అది కూడా సీక్వెల్ అవ్వడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ డబుల్ ఇస్మార్ట్ ప్రకటింపబడింది. షూటింగ్ కూడా ప్రారంభం అయ్యింది. తాజాగా ముంబైలో ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ ను ప్రారంభించినట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. ఈ షెడ్యూల్ లో రామ్ మరియు సంజయ్ దత్ లతో పాటు ముఖ్య నటీనటులు పాల్గొనబోతున్నారు. ఈసారి రెట్టింపు వినోదాన్ని అందించే విధంగా డబుల్ ఇస్మార్ట్ ఉంటుందని యూనిట్ సభ్యులు ధీమాగా చెబుతున్నారు. యాక్షన్ తో పాటు పూరి మార్క్ టేకింగ్ తో డబుల్ ఇస్మార్ట్ ఉంటుందని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. తాజాగా ప్రారంభం అయిన ముంబై షెడ్యూల్ తో సినిమా షూటింగ్ మెజార్టీ పార్ట్ పూర్తి అయినట్లుగా భావించవచ్చు. అతి త్వరలోనే సినిమా షూటింగ్ కు గుమ్మడి కాయ కొట్టడంతో పాటు ప్రమోషన్ కార్యక్రమాలు షురూ చేయాలని పూరి భావిస్తున్నాడు. Aజూన్ నెలలో సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికి సాధ్యం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.